

అంబరం కాలేజీలో లెక్చరరు.

వేరొక కంపెనీలో పనిచేస్తున్నాడు రాజా. వారిద్దరి స్నేహం ఒకదా న్నొకటి పెనవేసుకున్న లతాబంధం లాటిది. బాల్యంనుండి, హైస్కూల్లో కాలేజీలో కూడా సహపాఠులే. మనుష్యులు వేరైన మనసు లొక్కటిగా సంచరిస్తుంటారు. ఒకరిమాటమీద మరొకరికి ఎంతో విశ్వాసం, నమ్మకం. ఒకరు కాదనుకున్న పనిని మరొకరు చేయలేరు. ఒకరికోసం మరొకర్ని బలైపొమన్నా యిద్దరిలోనూ ఎవరూ వెనుదీయరు. అటువంటి స్నేహ సాన్నిహిత్యాలందరికీ లభించవు. దానికి కూడా పూర్వజన్మసుకృత ముండాలి.

రాజా ఇప్పటివరకూ బోధించిన విషయంమీద అంబరం ఆలోచించలేకపోయాడు. మనసు వేరొక దాన్ని గూర్చి యోచించడం ఎప్పుడో మానేసింది. ఎప్పుడూ 'నిర్మల' తన కండ్లెదురుగా సంచరిస్తున్నట్లు వూహించుకొంటూ ఉంటాడు

రెండు సంవత్సరాల నుండి నిర్మల తన స్నేహ, ప్రేమదేవతగా, సహధర్మచారిణిగా తన కష్ట సుఖాలను పంచుకొనే భాగస్వామిగా ఉండి, స్మృతి చిహ్నంగా పాపను విడచి తనకు దూరమైపోయింది.

ఆ రోజుల్లో నిర్మలను విడచిన ఆ ఒక్క క్షణం యుగంగా గడిచేది. కాలేజీకి పోయినా ధ్యాసంతా యింటిదగ్గరే ఉండేది.

మరి .... నేడు ?

అంతా అంధకారం.

ఆలోచిస్తున్నాడు అంబరం. జీవిత గ్రంథంలో గతంలో నింపిన పేజీలను తిరగేయసాగాడు.


ఒకనాడు తాను కాలేజీనుండి వస్తున్నాడు. (తన రూము కాలేజీకి దగ్గరలోనే ఉండడంచేత రోజూ నడచే వెళ్ళి వచ్చేవాడు.)

నెమ్మదిగా పడుతున్న చినుకులు కాస్తా ఎక్కువై వర్షం జోరుగా కురవసాగింది. పరుగు తీసి దగ్గరలో ఉన్న బంగళా గేటు త్రోసి లోనికి పోయి చూరుక్రింద నిలబడి, కళ్ళద్దాలు తుడిచి మళ్ళీ పెట్టుకొని చుట్టూ పరిశీలించసాగాడు.

---

బొంబాయి ఆంధ్ర మహాసభవారు జరిపిన పోటీలో రెండవ బహుమతి పొందినకథ.







అక్కడకు దగ్గరలోనే ఒక కిటికీ ఉంది. కిటికీఅవతల ఏో అమ్మాయి కూర్చుని ఏదో చదువుకుంటోంది.

తా నక్కడ చేరుకోవడంతో ఆమె తన చదువు నాపి తనవైపే చూడ సాగింది. తనకుధైర్యం చాలకపోయింది. వర్షంలోకి చూడసాగాడు. వర్షం మరింత ఎక్కువవుతోంది. కిటికీవైపు చూడ లేదు చూడకుండామాఉండలేకపోయాడు. చూశాడు.

"లోపలికి రండి. తడిసిపోయే ట్లున్నారు"

తాను వెళ్లలేదు. అట్లానే నిల బడ్డాడు వెళ్లేందుకుసంకోచిస్తున్నాడు.

ఆమె యింకా అలానే ఆహ్వానంగా చూచేసరికివెళ్లక తప్పలేదు.

లోనికిపోయి ఆమె చూపిన సోఫాలో కూర్చుని "థాంక్స్ . . ." అన్నాడు. ఆమె చదువుతున్న నవలకేసి చూశాడు. ఆనవల తాను వ్రాసిందే.

ఆమె రెండు నిమిషాలు ఆఖరి పేజీలు తిరగేసిపుస్తకం చదవడం పూర్తిచేసింది.

"ఎంత బాగా వ్రాశారండీ .... యీ కథ ?"

తను అంబరం .... అని, తానానవల వ్రాసినట్టు యీామె కెలా తెలుసు? అని ప్రశ్నించుకొనిఎవరైనా చెప్పి వుండొచ్చునని, అయితే యీామెకుతాను ముందే తెలుసునని సమాధానపరచుకున్నాడు.

"ఆవునండి. నే వ్రాసిన వాటిల్లో యిదే నాకు బాగా సంతృప్తి నిచ్చింది. ఈ నవల పూర్తిచేసి నపుడే ఎంతో భవిష్యత్తు సాధించబోతున్నట్టు సంతోషించాను."

"అరె ...., మీపేరేనా అంబరం .... ?" ఆమె ఆశ్చర్యంతో ప్రశ్నించేసరికి తాను 'స్టన్న్' యి అలానే కూర్చుండిపోయాడు చైతన్యరహితంగా.

తానా నవల వ్రాసినట్టు స్వయంగా చెప్పుకొని తెలివితక్కువతనాన్ని తెలియపరచుకొన్నాడు. నిజంగా తన మాటలో ఏమీ లోపం లేకపోయినా తానలా ఫీలయాడు. ఇక దాచి ఏం లాభం లేదనుకున్నాడు.

"అవునండి. నా పేరే అంబరం !"

"ఈ నవల వ్రాసింది మీరేనా ? చంపేశారు పొండి. మీ గురించి మా చెల్లెలు చెప్తుండేది. స్వయంగా చూస్తుంటే నా కెంతో ఆనందంగా ఉంది. కూర్చోండి—ఇప్పుడే వస్తాను" అంటూ లోనికి వెళ్లింది.

అదే సమయంలో లలిత ప్రవేశించింది.

వస్తూనే—

"అరె మాష్టారూ ...." అంటూ ఆశ్చర్యంతో నమస్కరించింది.

నిర్మల కాఫీ తీసుకొచ్చింది. తాను అడ్డు చెప్తాడని కాబోలు—

"తప్పదు. తీసుకోండి" అంది.

"అక్కా, ఈయన మా తెలుగు లెక్చరరుగారే. పేరు—అంబరం. ఈయనే నీకిష్టమైన రచయిత.

"ఈమె మా అక్క నిర్మల" అంటూ నిర్మలను పరిచయం చేసింది లలిత.

"మిమ్మల్ని చూడగలనని అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది" అంది నిర్మల.

ఆ ప్రథమ పరిచయంతో తాను వారంతో ఏదో ఒకరోజు వారింటికి పోయేవాడు. తరువాత తరువాత రోజూ వెళ్లేవాడు. అప్పుడప్పుడు వారి తల్లితో కూడా మాట్లాడుతుండేవాడు. ఆమె కూడా చాలా మర్యాదస్తురాలు. మాటల్లో రాజా తమకు చుట్టమని, తరచు తమ యింటికి వస్తుంటాడని కూడా చెప్పిందామె. తన ప్రాణమిత్రుడు యిక్కడ కూడా కలిసినందుకు తానెంతో ఆనందించాడు. చాలారోజులలానే గడచిపోయినయ్.

ఒకరాత్రి తాను బాగా ఆలోచించుకున్నాడు. నిర్మల ఇంటికి తా నెందుకు పోతున్నట్టు ? స్నేహభావమని మొదట సరిపెట్టుకున్నాడు. కాని, అంతతో ఆత్మసంతృప్తి కలగలేదు. ఆలోచించి, ఆలోచించి చివరకు తాను నిర్మలను ప్రేమిస్తున్నట్టు తేల్చేసుకున్నాడు.

ఒకరోజు ధైర్యంచేసి నిర్మలతో వివాహ ప్రస్తావన చేద్దామని వెళ్లాడు.

నిర్మల మెట్రిక్ వరకే చదువుకున్నా సుగుణవంతురాలు, అందమైంది. అంతకన్నా తనకు ఏం కావాలి ? ఆమెను చేపట్టలేని తన జన్మ వృథా అనుకొన్నాడు. ఆ నిశ్చయంతోనే వెళ్లేడు.

నిర్మల—తాను ఆరోజు ఎంతోసేపు మాట్లాడుకున్నారు.

డాబామీది తెల్లని వెన్నెల ఏవేవో కోర్కెల్ని లేకెత్తిస్తోంది.

ఎప్పుడు సమయం చిక్కుతుందా, ఎప్పుడు తన మనసుకు వెల్లడి చేద్దామా అని ఆలోచిస్తున్నాడు తాను. ఆ ఆలోచనల్లో నిర్మల ఏమి చెప్తున్నది కూడా వినిపించుకోవడంలేదు.

తాను పరాకుగా ఉన్నట్లు నిర్మల పసి గట్టేసింది కాబోలు !

"ఏమంటారు ?" అంటూ ఏదో ప్రశ్నించింది.

తానీలోకంలోకి వచ్చి — విన్నది ఏమీ లేదు గనుక ఆమె కండ్లలోకే రెప్పలార్పకుండా చూస్తూ చిరునవ్వుతో సమాధానపర్చాడు.

నిర్మల కండ్లనే తీక్షణంగా చూస్తుంటే ఆ కండ్లు తన జీవితానికి వెలుగు చూపించేవిగా కనిపించాయి.

వెదకబోయిన తీగ ఎదురైంది.

"మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. స్వీకరించలేరూ ?"

(57–వ పేజీ చూడండి

# ఆదర్శ జీవులు

(9వ పేజీ తరువాయి)

నిర్మల నోటినుండి వచ్చిన యీ మాటలతో జీవితంలో గొప్ప విజయాన్ని సాధించా ననుకున్నాడు.

"నిర్మలా .... !" అంటూ ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

నిర్మలను పెళ్లి చేసుకున్నాడు. ఆరోజు తానెంతో అదృష్టవంతునిగా మురిసిపోయాడు.

అప్పటినుండి తన ప్రాణానికి మరో పేరు నిర్మల. అటువంటి నిర్మలను పోగొట్టుకుని జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాడు. నిర్మల — సాంసారిక జీవితంలో ఎటువంటి ఆలోచనలకు తావులేకుండా పోయింది. ఆమె తన దగ్గరగా ఉంటే లోకాన్నే మరచిపోయేవాడు. ఆ నిర్మలను మరచిపోగలడా ? నిర్మల కన్ను మూస్తూ లలితను పెళ్లి చేసుకోమని చెప్పినా, తాను లలితకు, నిర్మల కున్నంత స్థానా న్నివ్వగలడా ? లలితకు అన్యాయం చేసినవా డవుతాడేమో !

అనేక విధాలుగా ఆలోచించి చూశాడు. అతని ఆలోచనల్లో ఎటువంటి నిర్ణయానికీ రాలేక పోయాడు. చివరికి తన జీవిత మేమవుతుంది ? పాపను చూసేవా రెవరు ?

ఆలోచనలు మానుకుందామన్నా కుదరడంలేదు. ఒకదానిపై మరొకటి సమస్యలపై సమస్యలు సాలిగూడులా తన చుట్టూ ఆవరించుకొంటున్నాయ్. ఎలా పరిష్కరించాలి ?

రాజు ఆ సాయంత్రం వచ్చాడు.

"అంబరం .... నే చెప్పిన విషయం గూర్చి బాగా ఆలోచించుకున్నా వనుకుంటా. చూడు ...... మన మేది చేసినా, భవిష్యత్తు నాలోచించి చేయాలి. ఇలా ఎంతకాలమని సంసారరహితమైన జీవితంతో కాలం గడపగలవు ? నిర్మల పోయి మూడు నెలలైనా కాలేదు. చిక్కి సగమైపోయావ్. నీ గూర్చిన జాగ్రత్త ఏమీ తీసుకుంటున్నట్టు లేదు. నీవు నాలా వంటరివాడివి కావు. నేను పెళ్లి చేసుకొన్నా, చేసుకోపోయినా బాధ అంతగా లేదు. నా వెనకాల అడిగేందు కెవరూ లేరు. నా మూలంగా బాధపడేవా రంతకన్నా లేరు. ఒకమారు అలాగే నీవాలోచించి చూడు. పసిపాప ఉంది. దానికి తగిన భవిష్యత్తు చేకూర్చాలి. అది నీమీద ఆధారపడి ఉంది. నేను చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పడంవల్ల ప్రయోజనంలేదు. ఏదో ఒక నిర్ణయానికి రా. నీకిక చెప్పదలుచుకోలేదు."

రాజు మాటలతో అంబరం చాలసేపు దీర్ఘంగా యోచించాడు. ఇదివరకనే ఆ విషయంమీద ఆలోచించుకున్నా .... రాజు మాటల్లో సత్యం గోచరిస్తోంది.

"అవును ఇపుడొక నిర్ణయానికి రావాలి" గొణిగాడు అంబరం.

ఆ మిత్రు లిరువురి మధ్య చాలసేపు మౌనం నిలిచిపోయింది.

"రాజూ .... సరే, నీ మాటే నెగ్గిందిలే .... !"

అంతతో రాజు ఎగిరి గంతేశాడు. హృదయమెంతో తేలికైనట్టుగా ఫీలయాడు.

*　　*　　*

లలిత అంబరాన్ని వివాహం చేసుకొంది. నిర్మలను మరపించి ఆనందింప జేసేందుకు ప్రయత్నిస్తోంది.

అంబరం కూడా లలిత సహచర్యత్వంలో నిర్మలను నెమ్మదిగా మరచిపో గల్గుతున్నాడనే చెప్పాలి.

రాజు తరచు అంబరాన్ని కలుసుకొంటున్నాడు. కష్టసుఖాలు మాట్లాడుకొంటున్నారు.

కాలచక్రం రోజుల్ని లెక్కిస్తూ దొర్లిపోతోంది. సంవత్సరాలు గడిచినయ్.

పాపతో నిర్మలను చూసుకొని, లలిత దాంపత్య జీవితంలో ఎలాటి ఒడిదుడుకులు లేకుండా యీ మూడు సంవత్సరాలు సుఖంగానే గడిచిపోయినయ్.

ఒకరోజు సాయంత్రం అంబరం కాలేజీనుండి హుషారుగా నడచివస్తున్నాడు.

దగ్గరలో ఉన్న క్లాక్‌టవర్ 'టంగ్ .... టంగ్ ....' మంటూ ఆరు గంటలు కొట్టింది. యాంత్రికంగా గంటలను లెక్కపెట్టాడు అంబరం. సమయంతోబాటు రోజు, రోజుతో బాటు నెల, సంవత్సరాల క్రిందటి గాధ జ్ఞప్తి కొచ్చింది. ఉలిక్కిపడ్డాడు అంబరం.

సరిగ్గా, ఇదే సమయంలో, ఇదేరోజు, ఇదే నెలలో నిర్మల తనకు పాపనిచ్చి హాస్పిటల్లో కన్ను మూసింది. ఆ దృశ్యం కండ్లకు కట్టినట్టుగా కనిపించింది. కళ్లల్లో నీళ్ళు నిండుకున్నాయ్. రోడ్డు, రోడ్డుమీది మనుషులు, కార్లు, దీప స్తంభాలు అన్నీ అస్పష్టంగా కనిపిస్తున్నాయ్. 'నిర్మల' అని నోట్లోనే ఉచ్చరించుకున్నాడు. ఆ నిర్మల తలంపుతో కళ్ళు చూస్తున్నా గ్రుడ్డివైనాడు. చెవులున్నా వినిపించడంలేదు. అనాటి దృశ్యం కళ్ళ కెదుట తెరగా ఏర్పడి చిత్రీకరిస్తున్నట్టు కనిపిస్తోంది. ఆ తెర వెనుక అంతా అంధకారం. ఆవేదనగా అడుగులు వేస్తున్నాడు. అతడు వేయడంలేదు అడుగులు. ఒక ముఖ్యమైన రోడ్డని కూడా మరచిపోయి కాళ్ళు నాటి కవి తోచినట్టుగా నడుస్తున్నాయ్.

వెనుకనుండి వచ్చే లారీ హారను కూడా వినిపించలేదు. చాలా వేగంగా వచ్చే లారీ—'హారను వేసినా నిర్లక్ష్యం చేస్తున్నాడనే' అక్కసుతోనేమో మీదినుండి పోయి తక్కున ఆగిపోయింది.

అంబులన్స్ వచ్చింది.

హాస్పిటల్‌లో ఉన్నాడు అంబరం.

స్పృహలోకి వచ్చి, కండ్లు తెరచి చూచాడు. తన ప్రక్కగా లలిత పాప నెత్తుకొని కళ్లనుండి నీరు ధారగా ప్రవహిస్తుండగా, తన్ను దీనంగా చూస్తోంది.

"రాజు .... రా .... జు" అంటూ నిద్ర వరించినట్టు మాట్లాడాడు అంబరం.

వెంటనే రాజుకు కబురు పంపించారు.

అంబరానికి ఏక్సిడెంటయిందని తెలిసికోగానే మరుక్షణంలో అక్కడకు చేరుకున్నాడు రాజు; అంబరంమీదపడి భోరుమన్నాడు. అంతగా లలిత కూడా విచారించి ఉండదేమో !

"రా .... జూ .... వచ్చావా .... ! నే నిక బ్రతకలేను రాజూ .... బ్రతకను. నాకో ఉపకారం చేయాలి. లేకపోతే నాకు శాంతి లేదు. అలా చూడు .... నా లలిత .... నా నిర్మల .... ఎలా చూస్తుందో .... ? రాజూ ...., నేను నా నిర్మలను కలుసుకొంటున్నాను. లలితకు తీరని ద్రోహం చేస్తున్నాను రాజూ .... ! లలితకు వైధవ్యం రాకూడదు. అవును రాకూడదు. నే బ్రతుకుతానా .... రాజూ ?" పిచ్చిగా మాట్లాడసాగాడు.

"అంబరం నీవేమీ కావు. మళ్లీ వెంటనే మామూలు మనిషి వవుతావ్ .... నీ కేమీ పరవా లేదు, భయపడకు."

రాజు అంబరాన్ని తృప్తిపరచేందుకు ప్రయత్నిస్తున్నాడు. లోపల మాత్రం డాక్టర్లు పెదవి విరచిన దృశ్యం కనిపిస్తోంది. తానేం చేయగలడు? ఈ సమయంలో తాను ఏం సహాయం చేయవలసి ఉంటుంది ?

"రాజూ ...., లేదు రాజూ, నే బ్రతకను. నేను పోతున్నా రాజూ .... ఇక ఎక్కువసేపు నీతో మాట్లాడనేమో కూడా .... నాకో సహాయం చేయాలి. అవును. చేస్తావుకదూ .... !"

"నీవేం చెప్పినా చేస్తాను. నీకోసం నా ప్రాణమైనా ధారపోస్తాను."

"నీ హృదయం నాకు తెలుసు. నీవంతపని చేయగలవాడవే. రాజూ .... నే నొక పెద్ద భారాన్ని నీపై

ఒక ఉపన్యాసకుడు రెండు గంటలనుండి ఏకధాటీగా ఉపన్యసిస్తున్నాడు. అప్పటికే శ్రోతలు విషయశూన్యమైన ఆ ఉపన్యాసం వినలేక విసుగెత్తివున్నారు. కాని యిదేదీ గమనించకుండా ఆ వ్యక్తి యిలా చెప్పుకుపోతున్నాడు:

"మనకు యింకా మతిపోగొడుతున్నవి ఏమిటంటే ఈరకరకాల పార్టీలు, యీ వేరు వేరు మతాలు, యీ అంతర్జాతీయ రాజకీయాలు...యింకా... యింకా...యింకా..." అని ఆ వక్త తడుముకుంటూ వుండగా సభలో ఒక మూలనుండి ఒక శ్రోత "వినేవాళ్ళ బాధనైనా గమనించకుండా యింకా సాగిపోతూవున్న యీ ఉపన్యాసం!" అంటూ పూర్తిచేశాడు.

బి. వి. వి. ఆర్. సుబ్బారావు, (అనపర్తి)

## పూవు మీా అదృష్టం చెప్పగలదు



మీా భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీా సరియైన దర్యనుగురించిన్నీ మీారు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీాకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీారు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీా సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీారు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీాయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీాకు జయముకలుగునో, మీా ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీాకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.






కుటుంబం
అంతటికీ
ఉపకరించే
సముచితమైన
సబ్బు

# మార్గో సబ్బు




అతి నాజూకుగా, రమ్యమైన వాసనలీనే ఈ సబ్బు స్త్రీలకు, పిల్లలకు అతి మృదువుగా వుండే చర్మాన్ని పరిపోషించడంలో సాటిలేనిది. శుద్ధిచేసిన వేపనూనెతో తయారుచేసి, సుగంధ పరిమళాలతో మేళవించబడిన ఈసబ్బు చర్మవ్యాధు లన్నింటినీ నివారించి, శరీరానికి వన్నెలుతేవడంలో ప్రసిద్ధికెక్కినది.

ది కలకత్తా కెమికల్ కంపెనీ లిమిటెడ్, కలకత్తా - 29

దక్షిణ ఇండియా ఆఫీసు 5/149 బ్రాడ్వే, మద్రాసు-1.


# ఆదర్శ జీవులు

దుంచుతున్నాను. దాన్ని భరించడానికి నీకు ధైర్యముంటుంది కదూ ....!"

"తప్పకుండా. నే చేయగలిగిన సహకార మేమున్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. చెప్పు ...."

"రాజా .... నాకు మాటివ్వు. చేతిలో చేయివేసి మాటివ్వు."

తన మిత్రత్వాన్నే శంకిస్తున్న అంబరాన్ని చూసి, రాజా కనుకొలకుల్లో మరోమారు నీళ్ళు నిలిచినయ్. అలానే మౌనంగా చేతిలో చేయి వేశాడు.

"రాజా .... లలితను చూడు .... నా పాపను చూడు, నా పాపకు తండ్రి లేకుండా చేయలేను. నా లలితకు వైధవ్యం ప్రాప్తించనీయను. స్వలాభం కోసమే చేస్తున్నా ననుకో. అయినా నీవు త్యాగం చేయక తప్పదు. అవును లలితా .... నీవు కూడా. రాజా .... నీకన్నా వేరే ఆప్తులు నా కెవరున్నారు ? నాకోసం లలిత విలపిస్తుంటే నాకు శాంతి ఎలా లభిస్తుంది ? నాకు భార్యలేని లోపం నీ కారణంగా తీరింది. ఆనాడు నా పాపకు తల్లిని తెచ్చిపెట్టావ్. ఆ పాప, లలిత దుఃఖిస్తుంటే నీవు మాత్రం చూస్తూ వూరుకోగలవా .... ?"

"అంబరం .... నీ మాటలు నాకేమీ అర్థమవడంలేదు. అదేదో సరిగా విపులంగా చెప్పు."

"విపులంగా చెప్పేందుకు వోపిక లేదు.. చెప్తూ కూర్చుంటే .... పుణ్యకాలం కాస్తా మించి పోతుంది. నాపని పూర్తిచేసుకోలేక పోతాను. లలితా .... ఇటు చూడు. నేను బాగా ఆలోచించే .... యీపని చేస్తున్నాను. నా మాటల్ని సరిగా అర్థం చేసుకొని, మరేవిధంగానూ ఆలోచించకుండా నిర్వర్తిస్తావుకదూ ....! ఏం లలితా .... మాట్లాడవేం?

చేతులో పాప ముఖాన్ని, తలను నిమిరాడు అంబరం. అతని కండ్లలో నీళ్ళు నిండినయ్.

లలిత మాట్లాడలేదు. విచారంలో గొంతు పూడ్చుకుపోగా, చేతులో ముఖాన్ని కప్పుకొని యేడుస్తోంది.

అంబరం లలిత కండ్లు తుడిచాడు.

లలిత చేతిని తీసుకొని రాజా చేతిలో ఉంచి కళ్ళు మూశాడు.

రాజా చిత్తరువైపోయాడు.

తనకు విచిత్రంగా కనిపించినా, అంబరం చెప్పినదాన్ని అర్థం చేసుకొని ఆచరణలో పెట్టడమే తన మిత్రధర్మం.

అతని కండ్లనుండి పడిన అశ్రుకణాలు లలిత చేతిపై పడినయ్.

లలితవైపు చూశాడు.

పాపవైపు చూశాడు.

లలిత రాజా చేతిలోనుండి చేతిని తీసివేయ లేదు. అలానే ఉంచి అంబరంమీద పడి విలపించింది.

వారు ఆదర్శజీవులు. ★